# ఇల్లెందు చరిత్రను తిరగ రాసిన కేసీఆర్

- రూ.3వేల కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి
- రైతుబంధు పథకానికి రూ.715.61 కోట్లు
- బస్‌డిపోతో నెరవేరిన ఆరు దశాబ్దాల కల
- పట్టణంలో ఎరువుల తయారీ కేంద్రం
- మారిన ఇల్లెందు ముఖ చిత్రం





పట్టణంలో సుందరంగా నిర్మించిన రోడ్లు, వైద్య విధాన పరిషత్ సామాజిక ఆరోగ్య కేంద్రం, రూ.9కోట్లతో నిర్మించిన ఉప్పలపాడు-చోక్లాతండా బ్రిడ్జి

ఇల్లెందు, నవంబర్ 29: నీళ్లు, నిధులు, నియామకాల కోసం కేసీఆర్ ప్రారంభించిన మలిదశ ఉద్యమం తెలంగాణ ప్రాంత విముక్తికి 15 ఏళ్లు పట్టింది. జూన్ 2, 2014న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. సమైక్యాంధ్ర పాలనలో మసకబారిన జీవితాలకు ప్రధానంగా మన్యం ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావం కొత్త వెలుగులు నింపింది. వలసాంధ్ర పాలకుల దగ్గర పనిచేసిన తెలంగాణ బిడ్డల బానిస సంకెళ్లు తెగిపడ్డాయి. మన రాష్ట్రం వచ్చింది, మన పరిపాలన మొదలైంది. తెలంగాణ వస్తే ఏం లాభమని వెకిలి మాటలన్న ప్రబుద్ధులకు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం వారి అనుభవంలోకి వచ్చింది. దేశానికి వెన్నుముకైన రైతుకు ఏమి ఇవ్వకుండానే నీటీ తీరువా పన్ను వసూలు చేసిన చరిత్ర గతం. ప్రస్తుతం రైతుబంధు, రైతు బీమా ఇచ్చి రైతుకు ధీమా కల్పించిండు ముఖ్యమంత్రి.

**ఇల్లెందు బస్ డిపోతో నెరవేరిన కల..**

ఇల్లెందులో బస్ డిపో ఏర్పాటు చేయాలని ఆరు దశాబ్దాలుగా ప్రజలు కోరుతున్నారు. కానీ ఏ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదు. కేవలం ఎన్నికల సమయంలోనే హామీలిచ్చి ఓట్లు వేయించుకుని మళ్లి కనిపించే వారు కాదు. బస్‌డిపోను తీసుకువస్తాని గత ఎన్నికల ప్రచారంలో హరిప్రియ హామీ ఇచ్చారు. గెలిచిన అనంతరం ఇచ్చిన హామీని వంద శాతం నెరవేర్చారు. ఇల్లెందు వాసుల చిరకాల కోరికను తీర్చారు. డీఎంఎఫ్ నిధుల నుంచి రూ.5.50 కోట్లు వెచ్చించి మంత్రి పువ్వాడ చేతుల మీదుగా డిపోను ప్రారంభించారు.

**చెరువులకు జీవం పోసిన మిషన్ కాకతీయ**

నెర్రెలు బారిన చెరువులకు జీవం పోసిన కేసీఆర్‌ను రైతులు మర్చిపోలేరు. వర్షాధార పంటలపైనే ఆధారపడి వ్యవసాయం చేసే ఏజెన్సీ ప్రాంతాలకు చెరువులు పెద్దదిక్కుగా ఉండేవి. పూడిక ఉండడంతో వర్షమొచ్చినా నీళ్లు చెరువుల్లో అంతగా ఉండేవి కావు. సమయానికి సాగు నీళ్లు లేక పంటలు ఎండిపోయేవి. మిషన్ కాకతీయ పథకం ద్వారా నియోజకవర్గంలో 410 చెరువులను బాగు చేయడానికి రూ.123.53 కోట్లు వెచ్చించారు. భూగర్భ జలాలు 69శాతం నుండి 92 శాతం పెరిగాయి. మత్స్యకారులకు జీవనోపాధి పెరిగింది. విద్యుత్ వినియోగం తగ్గింది. అధిక దిగుబడులు పొందుతున్నారు.

**సీతారామ ప్రాజెక్ట్‌తో**

**65,483 ఎకరాలకు సాగునీరు..**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్‌తో ఇల్లెందు నియోజకవర్గంలోని 65,483 వేల ఎకరాలకు సాగు నీరు రానుంది. దశాబ్దాల తరబడి సాగు నీరులేక గోస పడుతున్న రైతన్నకు కష్టాలు తీరనున్నాయి. ప్రాజెక్ట్‌కు ఇప్పటికే రూ. 3 వేల కోట్లు కేటాయించగా అం దులో రూ.200వందల కోట్లు భూసేకరణకు పోగా మిగిలిన నిధులు రూ.2800కోట్లు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఉపయోగించనున్నారు. ఇల్లెందు మండలం లో 13,648 ఎకరాలకు, టేకులపల్లిలో 12,788, కామేపల్లిలో 14,501, గార్లలో 13,642, బయ్యారంలో 10,904ఎకరాలకు సాగు నీరందనుంది.

**నాడు నిధులు అరకొరే.. నేడు నిధుల వరద**

1956 సంవత్సరంలో నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ రాష్ట్రం జూన్ 2, 2014న ఏర్పడే వరకు అంటే 67 ఏండ్లకు పైగా వలసాంధ్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులు సుమారు రూ.200 కోట్లకు మించలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రంలో నియోజకవర్గానికి మంజూరు చేసింది రూ. 3002.19 కోట్ల నిధులు. తెలంగాణ ప్రాంతంపై వలసాంధ్ర ప్రభుత్వాలు చూపిన అంతులేని వివక్షకు ఇది నిదర్శనంగా నిలుస్తుంది.

**ఆసుపత్రికి మహర్దశ..**

ఇల్లెందు నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న పేదల ఆసుపత్రికి తెలంగాణ రాష్ట్రంలో మహర్దశ పట్టింది. దశాబ్దాల తరబడి నిరాధారణకు గురైన ఆసుపత్రిని తెలంగాణ వచ్చాక వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేయడంతో అభివృద్ధికి నోచుకుంది. ఎమ్మెల్యే హరిప్రియ వినతిని పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు నిధులు కేటాయించారు. జనరల్ వైద్యులకు దిక్కులేని చోట 10 మంది స్పెషలిస్టు వైద్యులను, ముగ్గురు ఎంబీబీఎస్ డాక్టర్లను కేటాయించారు. గ్రామాల్లోని పీహెచ్‌సీలను పల్లె దవాఖానాలుగా మార్చారు.

**పట్టణంలో అభివృద్ధి పరుగులు..**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ఇల్లెందు పట్టణ రూపురేఖలు మారిపోయాయి. ఎమ్మెల్యే హరిప్రియకృషితో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చొరవతో పట్టణ అభివృద్ధికి రూ.315.10 కోట్లు మంజూరు చేశారు. సెంట్రల్ లైటింగ్, మిని ట్యాంక్ బండ్, చిల్డ్రన్స్ పార్క్, పట్టణ పకృతి వనాలు, పారిశుధ్య వాహనాలు, వీధి వ్యాపారలు సముదాయాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మల్టియుటిలిటీ సెంటర్, ఇంటిగ్రేటేట్ మార్కెట్, డిజిటల్ లైబ్రరీ, నర్సరీలు, మన బస్తి-మన బడి, పబ్లిక్ టాయిలెట్స్, ఎరువుల తయారీ కేంద్రం, పారిశుధ్య వాహనాలు, బస్తి దవాఖానాలతో పట్టణ అభివృద్ధి దేదీప్యమానంగా వెలుగుతున్నది.

**ఎఫ్ఎస్‌టీపీతో పర్యావరణానికి ఎంతో మేలు**

పర్యావరణాన్ని కాపాడలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎఫ్ఎస్‌టీపీని పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో నిర్మించింది. మానవ వ్యర్థాలతో ఎరువులను తయారు చేసేందుకు రూ.56 లక్షల్లు వెచ్చించి ఎఫ్ఎస్‌టీపీని (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మించింది. వ్యక్తిగత, ప్రజా మరుగు దొడ్ల నుండి సేకరించిన వ్యర్థాలను నేరుగా ప్లాంట్‌కు తరలిస్తారు. యంత్రాలలో డంప్ చేసిన తర్వాత మల వ్యర్థం, నీరు వేర్వేరు అవుతాయి. అనంతరం ఎరువును శుద్ధి చేసి పొడిగా మార్చుతారు. ఆ పోడిని పంట పొలాలకు, కూరగాయల సాగుకు వాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

**ఎరువుల తయారి కేంద్రంతో ఆదాయం..**

పట్టణంలోని తడి, పొడి చెత్తను డంప్ యార్డుకు తరలించి వేరు చేసిన అనంతరం ఎరువుగా మారుస్తున్నారు. ఆ ఎరువును రైతులకు విక్రయిస్తూ మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకుంటున్నది. రాష్ట్రంలోనే పెద్దదిగా ఇల్లెందు డీఆర్‌సీసీ పేరుగాంచింది.

### కేసీఆర్ సహకారంతోనే అభివృద్ధి చేశాను



ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, అజయ్‌కుమార్‌ల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగాను. సీసీ, బీటీ రోడ్లు, బ్రిడ్జిలు, పట్టణాల్లో సెంట్రల్ లైటింగ్, మార్కెట్లు, అంతర్గత రోడ్ల తదితర నిర్మాణాలకు రూ. 1814.40 కోట్లు ఖర్చు చేశాం. రూ.37.50 కోట్లతో ఇల్లెందుకు 100పడకల ఆసుపత్రిని, రూ.11.53కోట్లతో ప్రభుత్వ ఐటీఐ మంజూరు చేయించాను. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ని యోజకవర్గంలో 65,483 ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రాజెక్ట్‌కు రూ. 3,320కోట్లు కేటాయించింది. రైతు, బడుగు బలహీన వర్గాలు, స్త్రీ, శిశు, ఆరోగ్య సంక్షేమానికి ప్రభుత్వం రూ. 1,187కోట్లు ఖర్చు చేసింది.

**- ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ**

### ఎన్నో సంవత్సరాల కల ఇది



ఇల్లెందుకు బస్ డిపో రావాలని ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాం. ఆ కల నేడు నెరవేరింది. చాల సంతోషంగా ఉంది. ఇల్లెందు నుంచి కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు రాత్రి పూట వెళ్లాలంటే చాల ఇబ్బందిగా ఉండేది. డిపో రావడంతో ఆ దూరాలకు ఏ సమయంలోనైనా వెళ్లి వచ్చేందుకు అవకాశం ఉంటుంది. వరంగల్ పోవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ బస్ డిపో పూర్తి స్థాయిలో ఉపయోగపడాలని కోరుకుంటున్నాను. అదేవిధంగా తెలంగాణ రాక ముందు చెరువులను ఎవరూ పట్టించుకోలేదు. కేసీఆర్ వచ్చాక చెరువులో పూడిక తీయడంతో ఎండా కాలంలో కూడా నీళ్లు ఉంటున్నాయి.

**- పిల్లి శ్రీనివాసరావు, ఎంఈవో, ఇల్లెందు**

### కూలీ చేసిన చోటే.. దుక్కి దున్నుతున్న



మాది నిరుపేద కుటుంబం. వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్న. రోజువారి పనులకు వెళ్తేనే ఇంట్లో గడిచేది. ఆ సమయంలో దళితబంధు పథకం ద్వారా కేసీఆర్ ప్రభుత్వం రూ.10లక్షలతో ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. కూలీ పనులకు వెళ్లే నేను నేడు ట్రాక్టర్‌కు ఓనర్‌నయ్యాను. ఆ కూలీ పనులకు వెళ్ళే పొలాల్లోనే సొంత ట్రాక్టర్‌తో దుక్కి దున్నిస్తున్న. యజమానిగా దర్జాగా బతుకుతున్న. సర్కార్ మేలు జీవితంలో మరవలేనిది. దళితులను పట్టించుకున్న వారే లేని సమయంలో కేసీఆర్ దళిత కుటుంబాల్లో వెలుగులు నింపాడు.

**-దేవి వెంకన్న, గౌరారం గ్రామం, బయ్యారం మండలం**

### రైతు బాంధవుడు కేసీఆర్



వ్యవసాయ పెట్టుబడి కోసం పెట్టుబడిదారుల వద్దకు వెళ్లి వడ్డీకి అప్పులు తీసుకునే వాన్ని. పంట పండకపోతే అప్పులు డబుల్ అయ్యేవి. జీవితాంతం వడ్డీ వ్యాపారుల వద్ద రుణపడి ఉందేవాడిని. తెలంగాణ ప్రభుత్వం రైతు బంధు పథకంలో ఎకరానికి రూ.5వేలు, సంవత్సరానికి రెండు పంటలకు కలిపి రూ.10వేలు ఇవ్వడంతో అప్పులు తీర్చుకుంటూ వ్యవసాయం చేస్తున్నాను. కష్టాల్లో ఉన్న మా కుటుంబానికి కేసిఆర్ అండగా నిలబడ్డాడు. ఆయన రుణం తీర్చుకోలేం. ఇప్పుడు ధైర్యంగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న.

**- పెరుమాళ్ల కృష్ణయ్య, చల్లసముద్రం గ్రామం, ఇల్లెందు**

# ఇల్లెందులో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- 172 ప్రాంతాల్లో 241 పోలింగ్ కేంద్రాలు
- 48 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- ఇల్లెందు నియోజకవర్గంలో 2,19,569 మంది ఓటర్లు
- పోలింగ్ బూత్‌లను పరిశీలించిన కలెక్టర్

ఇల్లెందు, నవంబర్ 29: ఇల్లెందు నియోజవర్గంలో గురువారం జరుగనున్న ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. 172 ప్రాంతాల్లో 241పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1048 మంది ఎన్నికల సిబ్బంది విధుల్లో ఉన్నారు. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 48కాగా అందులో అతి సమస్యాత్మక కేంద్రాలు 17 ఉన్నాయి. అత్యధికంగా ఇల్లెందు పరిధిలో 87 పోలింగ్ బూత్‌లు ఉండగా, అత్యల్పంగా గార్ల మండలంలో 31 ఉన్నాయి.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అల బుధవారం పట్టణంలోని స్టేషన్‌బస్తి, మెయిన్‌రోడ్ ఉన్నత పాఠశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం జేకే కాలనీలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

**ఇల్లెందు నియోజకవర్గంలో ఓటర్ల వివారాలు..**

ఇల్లెందు నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. 1972లో ఎస్టీ రిజర్వుడ్ స్థానంగా మారింది. నియోజకవర్గంలో మొత్తం 2,19,569 మంది ఓటర్లుండగా అందులో పురుష ఓటర్లు 1,07,909 మంది కాగా మహిళా ఓటర్లు 1,11,658మంది ఉన్నారు. ఇందులో లంబాడ ఓటర్లు సుమారు 63,577 మంది ఉండగా కోయ సామాజిక వర్గానికి సంబంధించి 41,803 మంది ఓటర్లున్నారు. మొత్తం ఎస్టీ ఓటర్లు 1,05,377 మంది ఉన్నారు. ఇక్కడ లంబాడ, కోయ సామాజికవర్గ అభ్యర్థులే ఎన్నికల బరిలో తలపడుతుండగా 99,804 మంది గిరిజనేతర ఓటర్లు ఈ ఎన్నికల్లో కీలకం కానున్నారు.

ఇల్లెందు మండలం, టౌన్ కలిపి -78,510, బయ్యారం-36,985, గార్ల-29,745, కామేపల్లి-34,364, టేకులపల్లి మండలంలో-39,965 మంది ఓటర్లున్నారు. ఇతరులు-01 ఉన్నారు.

**టేకులపల్లిలో ఏర్పాట్లు పూర్తి**

టేకులపల్లి, నవంబర్ 29: మండలంలో గురువారం జరుగనున్న పోలింగ్ కేంద్రాల అన్ని ఏర్పాటు పూర్తి చేశామని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కొండపల్లి కృష్ణవేణి అన్నారు. బుధవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు, 32లొకేషన్‌లలో 44మంది ప్రొసిడింగ్ అధికారులు, 176 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. మండలంలో మొత్తం 39,965 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 19,919 మంది పురుషులు, 20, 046 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇల్లెందు నియోజక వర్గంలో నక్సలైట్ల ప్రభావిత ప్రాంతంలో ఉన్నందున ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకే పోలింగ్ జరుగుతుందన్నారు. సకాలంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.



ఇల్లెందు: స్టేషన్ బస్తీలోని బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్